# సర్వోత్తమ స్నేహం, సంబంధం మరియు సేవ ....... 2-1-85

సర్వ స్నేహి, సర్వశక్తివాన్ శివబాబా మాట్లాడుతున్నారు :-

ఈరోజు బాప్‌దాదా పిల్లల స్నేహంతో నిండిన బహుమతులు చూస్తున్నారు. ప్రతి బిడ్డ యొక్క స్నేహ సంపన్న బహుమతి రకరకాలుగా ఉంది. ఒకే బాప్‌దాదాకి అనేక పిల్లల బహుమతులు అనేక సంఖ్యలో లభించాయి. ఇటువంటి బహుమతులు ఇన్ని బహుమతులు విశ్వంలో ఎవ్వరికి లభించవు. ఇవి మనోభిరామునికి మనస్సుతో ఇచ్చే బహుమతులు. మనుష్యాత్మలైతే స్థూల బహుమతులు ఇస్తారు కానీ ఈ సంగమయుగంలో విచిత్ర తండ్రి మరియు విచిత్ర బహుమతులు. కనుక బాప్‌దాదా పిల్లలందరి స్నేహం యొక్క బహుమతి చూసి సంతోషిస్తున్నారు. ఎవరి బహుమతి బాబా దగ్గరికి చేరకుండా ఉండదు. ఆ బహుమతులు రకరకాల విలువలతో ఉంటాయి. కొంతమందివి ఎక్కువ విలువతో ఉంటాయి, కొంతమందివి తక్కువ విలువతో ఉంటాయి. ఎంత బాబాతో తెగిపోని మరియు సర్వసంబంధాల స్నేహం ఉటుందో అదే విలువైన బహుమతి. నెంబర్‌వారీ సంబంధం మరియు స్నేహం ఆధారంగానే మనస్సు యొక్క బహుమతి ఉంటుంది. ఇద్దరు తండ్రులు బహుమతులలో నెంబర్‌వారీ విలువ కలిగిన మాలను తయారుచేస్తున్నారు. మరియు మాలను చూసి ఏ విషయంలో విలువ తేడా ఉంది? అని పరిశీలిస్తున్నారు. ఏమి చూసి ఉంటారు? స్నేహం అందరికి ఉంది, బాబాతో సంబంధం అందరికి ఉంది, సేవ కూడా అందరు చేస్తున్నారు కానీ స్నేహంలో ఆది నుండి ఇప్పటి వరకు సంకల్పంలో అయినా లేక స్వప్నంలో కూడా ఏ వ్యక్తి లేక వైభవం వైపు ఆకర్షితం కాలేదు కదా! ఒకే బాబా యొక్క ఏకీరస, తెగిపోని స్నేహంలో సదా ఇమిడి ఉన్నారా? ఈ ప్రపంచం యొక్క ఏ వ్యక్తి లేక వస్తువు కనిపించనివిధంగా సదా స్నేహమనే అనుభవాల సాగరంలో లీనమై ఉన్నారా? అనంతమైన స్నేహమనే ఆకాశం మరియు అనంతమైన అనుభవాల సాగరం. ఈ ఆకాశం మరియు సాగరం తప్ప ఇంకేదీ ఆకర్షించకూడదు. ఇలా నెంబర్ అనుసరించి తెగిపోని స్నేహం యొక్క బహుమతి విలువైనదిగా ఉంటుంది. ఎన్ని సంవత్సరాలుగా జ్ఞానంలో ముందుకి వెళ్తూ ఉంటారో అంత స్నేహం విలువ స్వతహాగా జమ అవుతూ ఉంటుంది మరియు అంత విలువైన బహుమతి బాబా ముందు ప్రత్యక్షం అయ్యింది. అందరిలో మూడు విషయాల విశేషతలు చూసారు.

1. తెగిపోని స్నేహం - దీనిలో మనస్పూర్వకమైన స్నేహం ఉందా లేక సమయానుసారం, అవసరానికి, స్వార్ధంతో స్నేహం చేయటం లేదు కదా! సదా స్నేహస్వరూపం ప్రత్యక్షంలో ఉంటుందా? లేక సమయానికి ప్రత్యక్షం అయ్యి మిగిలిన సమయమంతా గుప్తం అయిపోతుందా? మనస్సును సంతోషపెట్టే స్నేహం ఉందా లేక మనస్సుతో విడదీయలేని స్నేహం ఉందా? స్నేహంలో ఈ విషయాలన్నీ పరిశీలించారు.

2. సంబంధం - దీనిలో మొదటి విషయం - సర్వ సంబంధాలు బాబాతో ఉన్నాయా లేక ఏదైనా విశేష సంబంధమే ఉందా? ఒక సంబంధం యొక్క అనుభూతి లోపంగా ఉన్నా సంపన్నతలో లోపం వస్తుంది. మరియు సమయానుసారం బాబాతో జోడించని ఆ ఒక సంబంధం తన వైపు ఆకర్షించుకుంటుంది. బాబా శిక్షకుడు, సద్గురువు ఈ విశేష సంబంధాన్ని అయితే జోడించారు కానీ చిన్న సంబంధం బాబాని మనవడు, మనవరాలుగా చేసుకోకపోతే ఆ సంబంధం కూడా


Created by Universal Document Converter

ఆకర్షిస్తుంది. కనుక సంబంధంలో సర్వసంబంధాలు జోడించామా? అని పరిశీలించుకోండి. రెండవ విషయం - బాబాతో ప్రతి సంబంధం 100% ఉందా? లేక ఒక సంబంధం 100 శాతం లేదా ఒక సంబంధం 50 శాతం లేదా నెంబర్ అనుసరించి ఉందా? శాతంలో కూడా పూర్తిగా ఉందా? లేక కొద్దిగా అలౌకానికి, కొద్దిగా లౌకికానికి పంచారా? మూడవ విషయం - సర్వ సంబంధాల అనుభూతి యొక్క ఆత్మిక రసం సదా అనుభవం చేసుకుంటున్నారా లేదా అవసరం అయినప్పుడే అనుభవం చేసుకుంటున్నారా? సదా సర్వ సంబంధాల రసం అనుభవం చేసుకునేవారా లేదా అప్పుడప్పుడు అనుభవం చేసుకునేవారా?

3. సేవలో విశేషంగా ఏమి పరిశీలించారు? మొదటి విషయం - స్థూలరూపంలో మనసా, వాచా, కర్మణా మరియు తనువు, మనస్సు, ధనం అన్ని రకాలుగా సేవాఖాతా జమ అయ్యిందా? రెండవ విషయం - తనువు, మనస్సు, ధనం, మనసా, వాచా, కర్మణా ఈ ఆరు విషయాలలో ఎంత చేయాలనుకుంటున్నారో అంత చేస్తున్నారా లేదా ఎంత చేయాలో అంత చేయకుండా శక్తిననుసరించి చేసారా? ఈ రోజు స్థితి మంచిగా ఉంటే సేవా శాతం కూడా మంచిగా ఉంటుంది మరలా రేపు ఏదోక కారణంగా స్థితి బలహీనం అయితే సేవా శాతం కూడా బలహీనం అయిపోతుంది, ఎంత ఉండాలో అంత ఉండటం లేదు, దీని కారణంగా శక్తిననుసరించి నెంబర్‌వారీగా అయిపోతున్నారు. మూడవ విషయం - బాప్‌దాదా ద్వారా జ్ఞాన ఖజానా, శక్తుల ఖజానా, గుణాల ఖజానా, సంతోషాల ఖజానా, శ్రేష్ఠ సమయం యొక్క ఖజానా, శుద్ధ సంకల్పాల ఖజానా ఏవైతే లభించాయో ఈ అన్ని ఖజానాల ద్వారా సేవ చేసారా లేదా కొన్ని, కొన్ని ఖజానాల ద్వారానే సేవ చేసారా? ఒకవేళ ఒక ఖజానాలో అయినా సేవ చేయటంలో లోపం వచ్చింది లేక దయాహృదయంతో ఖజానాలను కార్యంలో ఉపయోగించలేదు, కొద్దిగా చేసారు అంటే ఫలితంలో కూడా తేడా వస్తుంది. నాల్గవ విషయం - మనస్సుతో చేసారా లేక బాధ్యతతో చేసారా? సేవ సదా ప్రవహించే గంగలా ఉందా లేక అప్పుడప్పుడు ప్రవహించటం, అప్పుడప్పుడు ఆగిపోయేలా ఉందా? మూడ్ మంచిగా ఉంటే సేవ చేయటం, మూడ్ మంచిగా లేకపోతే సేవ చేయకపోవటం, ఇలా ఆగిపోయే చెరువులా లేదు కదా?

ఇలా ఈ మూడు విషయాల పరిశీలనతో ప్రతి ఒక్కరి విలువ పరిశీలించారు. ఇలా విధిపూర్వకంగా ప్రతి ఒక్కరు స్వయాన్ని పరిశీలించుకోండి. మరియు ఈ క్రొత్త సంవత్సరంలో లోపాలను సదాకాలికంగా సమాప్తి చేసి సంపన్నం అయ్యి నెంబర్‌వారీ విలువైన బహుమతిని బాబా ముందు పెడతాను అనే ధృడసంకల్పం చేయండి. పరిశీలించుకుంటే పరివర్తన అవ్వటం వస్తుంది కదా? ఫలితంలో చూస్తే ఇప్పుడు ఏదో ఒక విషయంలో ఎక్కువమంది శక్తిననుసరించి ఉన్నారు. సంపన్న శక్తి స్వరూపంగా లేరు. అందువలన ఇప్పుడు జరిగిపోయిందేదో జరిగిపోయింది అని భావించి వర్తమానాన్ని మరియు భవిష్యత్తుని సంపన్నంగా, శక్తిశాలిగా చేసుకోండి.

మీ దగ్గర ఏమైనా బహుమతులు ఉంటే ఆ బహుమతులలో ఏవి విలువైనవి అని పరిశీలించుకుంటారు కదా! బాప్‌దాదా కూడా పిల్లలతో ఈ ఆట ఆడుకుంటున్నారు. బహుమతులైతే లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రతి ఒక్కరు తమ శక్తిననుసరించి చాలా మంచి ఉత్సాహ,ఉల్లాసాలతో నిండిన, శక్తిశాలి సంకల్పం బాబా ముందు చేశారు. ఇప్పుడు కేవలం శక్తిననుసరించి చేయడానికి బదులు సదా శక్తిశాలిగా చేయాలి అనే దానిలోకి పరివర్తన చేసుకోవాలి.


Created by Universal Document Converter

సదా స్నేహి, మనస్సు యొక్క స్నేహి, సర్వ సంబంధాల స్నేహి, ఆత్మిక రసాన్ని అనుభవం చేసుకునే అనుభవీ ఆత్మలకు, సర్వ ఖజానాలతో శక్తిశాలిగా ఉండేవారికి, సదా సేవాధారి, అన్ని విషయాలను శక్తిననుసరించి చేస్తాము అని అనడానికి బదులు సదా శక్తిశాలి స్థితిలోకి పరివర్తన చేసుకునేవారికి, విశేషంగా స్నేహి మరియు సమీప సంబంధ ఆత్మలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## క్రొత్త సంవత్సరం యొక్క విశేష సంకల్పం ..... 7-1-85

సదా దాత, భాగ్యవిధాత, అవ్యక్త బాప్‌దాదా మాట్లాడుతున్నారు :-

ఈ రోజు విధాత బాబా తన మాష్టర్ విధాత పిల్లలను కలుసుకోవటానికి వచ్చారు. విధాత బాబా ప్రతి బిడ్డ యొక్క చార్ట్ చూస్తున్నారు. విధాత ద్వారా లభించిన ఖజానాలతో ఎంత వరకు విధాత సమానంగా మాస్టర్ విధాతగా అయ్యారు? జ్ఞాన విధాతగా అయ్యారా? స్మృతి ద్వారా శక్తుల విధాతగా అయ్యారా? గుణాల విధాతగా అయ్యారా? ఆత్మిక దృష్టి మరియు ఆత్మిక స్నేహం యొక్క విధాతగా అయ్యారా? సమయానుసారం ప్రతి ఒక్క ఆత్మకి సహయోగం యొక్క విధాతగా అయ్యారా? నిర్బలులకి మీ శ్రేష్ఠ సాంగత్యం యొక్క విధాతగా, సంపర్కం యొక్క విధాతగా అయ్యారా? అప్రాప్తి ఆత్మలను తృప్తి ఆత్మగా చేసే ఉత్సాహ, ఉల్లాసాలతో నిండిన విధాతగా అయ్యారా? ఇలా బాబా ప్రతి ఒక్కరి మాష్టర్ విధాత యొక్క చార్ట్‌ని చూస్తున్నారు.

విధాత అంటే ప్రతి సమయం, ప్రతి సంకల్పం ద్వారా ఇచ్చేవారు. విధాత అంటే విశాల హృదయులు. సాగరుని సమానంగా ఇవ్వటంలో విశాల హృదయం కలిగినవారు. విధాత అంటే బాబాతో తప్ప ఇక ఏ ఆత్మతో తీసుకునేవారు కాదు. సదా ఇచ్చేవారు. ఎవరైనా ఆత్మిక స్నేహం, సహయోగం ఇచ్చినా ఒకటికి బదులుగా కోటానుకోట్లు ఇచ్చేవారు. బాబా ఇచ్చేవారే కానీ తీసుకునేవారు కాదు. ఒకవేళ ఎవరైనా పిల్లలు తమ పాతవి ఇచ్చినా కూడా వాటికి బదులు ఎంత ఇస్తున్నారంటే ఆ ఇవ్వటం కూడా తీసుకోవటంలోకి మారిపోతుంది. ఇలా మాష్టర్ విధాత అంటే ప్రతి సంకల్పం, ప్రతి అడుగులో ఇచ్చేవారు. విధాత అంటే మహాన్ దాత. విధాతలు సదా ఇచ్చేవారిగా ఉంటారు కనుక సదా నిస్వార్థిగా ఉంటారు. స్వ స్వార్థానికి సదా అతీతంగా మరియు బాబా సమానంగా అందరికీ ప్రియంగా ఉంటారు. విధాత ఆత్మ పట్ల స్వతహాగానే అందరికి గౌరవం యొక్క రికార్డ్ ఉంటుంది. విధాతలు స్వతహాగానే అందరి దృష్టిలో దాత అంటే మహాన్‌గా ఉంటారు.ఇలా ఎంత వరకు విధాతగా అయ్యారు? విధాత అంటే రాజ్యవంశీయులు. బాబా సమానంగా సదా స్నేహం మరియు సహయోగం ద్వారా పాలన ఇచ్చేవారు. విధాత అంటే సదా సంపన్నులు. కనుక స్వయాన్ని తీసుకునేలా ఉన్నానా లేక ఇచ్చేటటువంటి మాష్టర్ విధాతనా అని పరిశీలించుకోండి.

ఇప్పుడు సమయానుసారం మాష్టర్ విధాత పాత్ర అభినయించాలి. ఎందుకంటే ఇప్పుడు సమయం సమీపంగా వస్తుంది అంటే బాబా సమానంగా అవ్వాలి. ఇప్పటి వరకు స్వయమే తీసుకునే భావనతో ఉంటే విధాతగా ఎప్పుడు అవుతారు? ఇప్పుడు ఇవ్వటమే తీసుకోవటం.


Created by Universal Document Converter